సాక్షి
యాదాద్రి భువనగిరి

శనివారం । 19 । ఆగస్టు । 2023



ఆర్టీసీ విలీనం గొప్ప నిర్ణయం

ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీ విలీనం గొప్ప నిర్ణయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. - 8లో



దొంగల హల్‌చల్

కొద్ది రోజులుగా మిర్యాలగూడ పట్టణ ప్రజలకు దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. - 8లో



రైతుల సంక్షేమమే ధ్యేయం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

గురుకుల కళాశాలల్లో 22న స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి : జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఈనెల 22వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘికక సంక్షేమ గురుకుల సంస్థ సమన్వయ అధికారి శ్రీరాం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను భువనగిరి, రాజాపేట, మోత్కూరు బాలుర, ఆలేరు, వలిగొండలోని బాలికల గురుకుల కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులు ఉదయం 11 గంటలకు భువనగిరి గురుకుల కళాశాలలో హాజరు కావాలన్నారు. విద్యార్థులు పదో తరగతిలో 8 జీపీఏకు పైగా ఉండాలన్నారు.

పంటల సాగు విధానాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి కవిత

చౌటుప్పల్ : పంటల సాగు విధానాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నష్టాలను నివారించవచ్చని ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి కవిత పేర్కొన్నారు. మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు, కూరగాయలు, పందిరి సాగు విధానాలపై స్థానిక రైతువేదికలో శుక్రవారం రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని సూచనలు చేశారు. సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవడం వల్ల పంట దిగుబడి పెంచుకోవచ్చన్నారు. చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు అధికారులను సంప్రదించాలని, నిర్లక్ష్యం చేస్తే పంటలు దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ నిపుణుడు డాక్టర్ శశిధర్, వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, ఏఈవో కె.వెన్నెల, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ కె.హరీష్, రైతులు, తదితరులు ఉన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ




అమ్మవారికి హారతినిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు, మరోవైపు శ్రావణమాసం ప్రారంభం కావడంతో ఆండాళ్‌దేవిని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపం ఊంజలి సేవోత్సవం జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి.శ్రీసుదర్శన నారసింహహోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవ తదితర కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

డీటీలకు పదోన్నతులు

సాక్షి యాదాద్రి : జిల్లాలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతి లభించింది. భువనగిరి ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తున్న జగన్‌ను కలెక్టరేట్, చౌటుప్పల్ పని చేస్తున్న ఇబ్రహీంను నల్లగొండకు పదోన్నతిపై బదిలీ చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ రెవెన్యూ భాస్కర్ రావు తెలిపారు.

• వరలక్ష్మీ వందనం



శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా భువనగిరిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని గాజులతో అలంకరించిన దృశ్యం

అభివృద్ధే మా బాట..

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం

- ప్రజల సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి
- సూర్యాపేటను జిల్లా చేశాం
- ఉమ్మడి జిల్లాలోనూ ఊహించనంతగా అభివృద్ధి పనులు
- అభివృద్ధి నిరంతర ప్రక్రియ.. దానిని కొనసాగిస్తూ ముందుకెళ్తాం

'సాక్షి'తో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'సూర్యాపేట జిల్లా రూపురేఖలను సమూలంగా మార్చేశాం. ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చాం. సంక్షేమాభివృద్ధిని ప్రజలకు అందించాం.. శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చాం..' అని రాష్ట విద్యుత్తు శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి చెప్పారు. సూర్యాపేటలోనే కాదు ఉమ్మడి జిల్లాలోనూ సాగు, తాగునీటి సమస్యతో పాటు ప్రజలకు ఎదురైన ప్రతి సమస్యను పరిష్కరించామన్నారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జిల్లాలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చూపించామన్నారు. అందులో భాగంగా.. చేపట్టిన అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకోబోతున్నామన్నారు. ఈ నెల 20న సూర్యాపేట జిల్లాలో నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్, మెడికల్ కాలేజీ భవనాలను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారని చెప్పారు. జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై, అమలు చేసిన హామీలపై శుక్రవారం మంత్రి జగదీశ్‌రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. మంత్రి వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

2014 ఎన్నికల్లో ఉద్యమ నాయకునిగా కేసీఆర్ జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి అయ్యాక పరిష్కరించారు. సూర్యాపేట నియోజకవర్గంలో నన్ను గెలిపిస్తే సూర్యాపేటను జిల్లా చేస్తానని హామీ ఇచ్చారు. సాగు నీరు, తాగునీరు కూడా అందిస్తామని ఆనాటి బహిరంగ సభలో ప్రకటించారు. సీఎం ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాను ఏర్పాటు చేశారు. మూసీ మురికినీటి సమస్యను పరిష్కరించారు. సాగునీటి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తర్వాత గోదావరి జలాలను ఎస్సారెస్పీ ద్వారా సూర్యాపేటకు తీసుకువచ్చారు. ఇప్పటికే నియోజకవర్గంలో 2 వేల కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ఇచ్చాం. మరో 3వేల మందికి గృహలక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం అందించి సొంతింటి కలను నెరవేర్చబోతున్నాం. ఒక్క సూర్యాపేట నియోజకవర్గంలోనే దాదాపు రూ.7 వేల కోట్లతో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాం

సూర్యాపేట పట్టణం జిల్లా కేంద్రం కావడంతో ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేశాం. రోడ్ల వెడల్పు చేశాం. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు కూడా కొంత వరకు పూర్తి చేశాం. సమీకృత కలెక్టరేట్, దేశంలో ఎక్కడాలేని విధంగా మోడల్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కాలేజీ భవనాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మించాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాం. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. పట్టణ ప్రజలు ఊహించని విధంగా అత్యంత ఆకర్షణీయంగా మినీ ట్యాంక్ బండ్‌ను అభివృద్ధి చేశాం. గతంలో సూర్యాపేట పట్టణ ప్రజలు సేద తీరేందుకు బోటింగ్ కోసం వెళ్లాలంటే ఇతర రాష్ట్రాల్లోని ఏదో ఒక సముద్ర తీర ప్రాంతానికో, కేరళ వంటి ఇతర ప్రాంతాలకో వెళ్లాల్సి వచ్చేది. పట్టణంలోని ట్యాంక్ బండ్‌లోనే బోటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాం.

శాంతిభద్రతలకు పెద్ద పీట

సూర్యాపేట జిల్లాలో గతంలో శాంతి భద్రతల పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితులను పూర్తిగా మార్చేశాం. శాంతి భద్రతల సమస్యలతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత శాంతి భద్రతల సమస్యను అదుపులోకి తీసుకువచ్చాం. ప్రజలు, వ్యాపారాలు స్వేచ్ఛగా ఉండేలా పరిస్థితులను మెరుగు పరిచాం.

ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధి

సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన మేరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ఎత్తున అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రాలతోపాటు ప్రధాన పట్టణాలు, మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులను చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధి ఇందుకు నిదర్శనం. ఉమ్మడి జిల్లాలో 3 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారు. సూర్యాపేటలోని నిర్మాణం పూర్తయింది. మిగితావి కొనసాగుతున్నాయి. తద్వారా ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుతుంది. ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి పవర్‌ప్లాంట్ కూడా రెండు మూడు నెలల్లో ప్రారంభించుకోబోతున్నాం. సాగునీటి ప్రాజెక్టు విషయానికొస్తే నల్లగొండలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు సాంకేతిక కారణాలతోనే ఆలస్యం అవుతోంది తప్ప మిగతా అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారు. ఎత్తిపోతల పథకాల పనులు జరుగుతున్నాయి.

త్వరలోనే ఐటీ హబ్

జిల్లాలో ఇంకా కొంత పారిశ్రామికీకరణ జరగాల్సి ఉంది. సూర్యాపేటలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలనుకున్నాం. స్థలం దొరక్క ఆలస్యమైంది. కలెక్టరేట్ ప్రారంభం కాగానే ఐటీ హబ్ పనులకు కూడా చేపట్టి పూర్తి చేస్తాం. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్లు ప్రధానం. వాటిని చేపడుతూ సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతాం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. దానిని కొనసాగిస్తూ ముందుకు వెళతాం.

మహనీయుల చరిత్ర నేటి తరానికి తెలియాలి



సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, గూడూరు నారాయణరెడ్డి, ఆచారి తదితరులు

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి
- చౌటుప్పల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి నివాళి

చౌటుప్పల్ : మహనీయుల చరిత్ర నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు అవుతున్నా ఆ ప్రయత్నం జరగలేదని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టిందన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా గతేదాది మహనీయుల పేరిట పోస్టల్ స్టాంపులను విడుదల చేశామని గుర్తు చేశారు. అందులో పాపన్న పేరిట కూడా స్టాంప్ ఉందన్నారు. శుక్రవారం ఖమ్మం పర్యటనకు వెళ్తున్న ఆయన చౌటుప్పల్‌లో ఆగారు. తంగడపల్లి చౌరస్తాలోని సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంతిర మాట్లాడుతూ మహనీయుల చరిత, వారి పోరాటాలు, త్యాగాలు నేటి తరానికి తెలియాలంటే పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చాలన్నారు. ఇందుకోసం రాజకీయాలకు అతీతంగా ప్రయత్నం జరగాలన్నారు. బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవ నినాదంతో ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిన పాపన్న లక్ష్యాలను నెరవేర్చే బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఘన స్వాగతం

మంత్రి కిషన్‌రెడ్డికి జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు, రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్‌ల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో మంత్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు రిక్కల సుధాకర్ రెడ్డి, ఊడుగు వెంకటేష్, సర్పంచ్‌లు బాతరాజు సత్యం, కాయితి రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు,నాయకులు ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య, దాసోజు భిక్షమాచారి, బత్తుల జంగయ్య, ఊడుగు యాదయ్య, చిన్నం మల్లేషం, ముద్దం సత్తయ్య, కాసుల వెంకటేశం, కడారి అయిలయ్య, కుక్కల నర్సింహ్మా, అమృతం దశరథ, గుర్రం రవీందర్, ఉబ్బు భిక్షపతి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, కట్ట కృష్ణ, రాధారపు సత్తయ్య, సందగళ్ల సతీష్, దిండు భాస్కర్, పబ్బు వంశీ, జగత్ కుమార్, బండారు మహేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

'తొలిమెట్టు'ను సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి : తొలిమెట్టు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డీఈఓ నారాయణరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం చౌటుప్పల్‌లోని నవభారత్ డిగ్రీ కళాశాలలో ఎంఈఓ, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమం ఉపాధ్యాయులకు హ్యాండ్ బుక్, వర్క్ బుక్‌పై శిక్షణ ఇచ్చారు. పాఠ్య ప్రణాళికలకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. మానిటరింగ్ అధికారులు క్షేత్ర పరిశీలనకు వెళ్లినప్పుడు వర్క్‌బుక్ లెసన్ ప్లాన్‌లోని అన్ని అంశాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఐఆర్‌పీ కో ఆర్డినేటర్ జోసెఫ్, డీసీఈబీ సెక్రటరీ పాండునాయక్, ఎంఈఓలు పాల్గొన్నారు.

బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక పాపన్నగౌడ్

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సాక్షి, యాదాద్రి : బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగలుల దౌర్జన్యాలను ఎదిరించి, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన గొప్ప వీరుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో యువత ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) భాస్కర రావు, అధికారులు భూక్యా మాన్యానాయక్, యాదయ్య, నవీన్‌కుమార్, శ్యాంసుందర్, బీసీ కుల సంఘం నాయకులు ఏశాల అశోక్, కొత్త నర్సింహ, అతికం లక్ష్మీ నారాయణ, బోలగాని జయరాములుగౌడ్, కొడారి వెంకటేశ్, మాటూరి అశోక్, బట్టు రామచంద్రయ్య, శివనాగేశ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం పూర్తి

సాక్షి,యాదాద్రి : హరితహారంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన మేరకు 17,0,6700 మొక్కలు నాటి లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హరితహారం, గృహలక్ష్మి, జీఓ 59, బీసీ, మైనార్టీలకు లక్ష రూపాలయ ఆర్థిక సాయం, గొర్రెల పంపిణీపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి జిల్లాలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుతీరును కలెక్టర్‌కు వివరించారు. హరితహారంలో నాటిన మొక్కలనిటికీ జియోట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాల వేడుకల ముగింపు సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో లక్ష్యం మేరకు మొక్కలు నాటుతామని చెప్పారు. మరణించిన ఆసరా పింఛన్‌దారుల భాగస్వాముల నుంచి 1269 దరఖాస్తులు వచ్చాయని, వాటన్నిటికీ మంజూరు ఇచ్చామని, 8 దరఖాస్తులు సాంకేతిక సమస్యలతో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రూ.లక్ష ఆర్థిక సాయం కోసం బీసీ కులాల నుంచి 1,4961, మైనార్టీల నుంచి 1772 దరఖాస్తులు వచ్చాయన్నారు. గొర్రెల పంపిణీకి సంబంధించి 2974 యూనిట్లకు గాను 1035 యూనిట్లు గ్రౌండింగ్ చేసినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఆర్‌ఓ పద్మజారాణి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, డీపీఓ సునంద తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి

భువనగిరి : జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో సెప్టెంబర్ 9వ తేదీ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి మారుతిదేవి అన్నారు. శుక్రవారం భువనగిరిలోని జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాస్క్యూటర్లతో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సమావేశమై జాతీయ లోక్ అదాలత్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడే విధంగా కృషి చేయాలన్నారు. పోలీస్‌లు, న్యాయవాదులు లోక్ అదాలత్‌కు సహకరించాలని కోరారు. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 8 వేల కేసుల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజేష్‌చంద్ర, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్‌జడ్జి నాగేశ్వర్ రావు, అదనపు ఎసీపీ వెంకట్‌రెడ్డి, పీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

82 వైన్స్‌లు | 3,969 దరఖాస్తులు



టెండర్‌దారులతో కోలాహలంగా మారిన భువనగిరిలోని ఎక్సైజ్ కార్యాలయం

మద్యం దుకాణాలకు పెద్ద ఎత్తున టెండర్లు

- రూ.124.28 కోట్ల ఆదాయం
- గతంలో కంటే రెట్టింపు

సాక్షి,యాదాద్రి : మద్యం టెండర్లు ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిపించాయి. మునుపెన్నడూ లేని విధంగా ఈసారి రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. రానున్న కొద్ది నెలల్లో అసెంబ్లీకి, ఆ తర్వాత పార్లమెంట్, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనుండడంతో వైన్స్ షాపులను దక్కించుకునేందుకు వ్యాపారులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. తమ స్నేహితులు, బంధువుల ద్వారా టెండర్లు దాఖలు చేయించారు. వీరితో పాటు రియల్టర్లు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు సైతం దరఖాస్తు చేసుకున్నారు.

మద్యం షాపులు, దరఖాస్తులు ఇలా..

జిల్లాలోని 82 మద్యం దుకాణాలకు 3,969 దరఖాస్తులు వచ్చాయి. శుక్రవారం ఒక్క రోజే 1,507 మంది దరఖాస్తు చేసుకున్నారు. టెండర్ల ద్వారా 79.38 కోట్లు, లైసెన్స్ ఫీజుతో రూ.44.90 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. మొత్తం రూ.124.28 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. రాత్రి 9 గంటల వరకు ప్రక్రియ కొనసాగింది.

సిండికేటయ్యారు

ఈసారి టెండర్ల దశలోనే వ్యాపారులు సిండికేట్ అయ్యారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు నిర్ణయించడంతో ఒక్కటై టెండర్లు వేశారు. 10 నుంచి 200 వరకు టెండర్లు వేసిన బ్యాచ్‌లున్నాయి. జిల్లా వ్యాపారులతోపాటు హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి, నల్లగొండ, సూర్యాపేట, జనగామ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారులు టెండర్లు వేశారు.

ఎల్లంబావి వైన్స్‌కు 135 దరఖాస్తులు

చౌటుప్పల్ మండలం ఎల్లంబావి మద్యం దుకాణానికి అత్యధికంగా135 దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత రాజాపేట మండలం పొట్టిమర్రి వైన్స్‌కు 90, బీబీనగర్ మండలం భట్టుగూడెం షాపుకు 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. అతి తక్కువ తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్ వైన్స్‌కు 27 దరఖాస్తులు వచ్చాయి.

సర్కిళ్ల వారీగా..

జిల్లాలో నాలుగు ఎక్సైజ్ సర్కిళ్లు ఉన్నాయి. భువనగిరి సర్కిల్ పరిధిలో 27 దుకాణాలకు 1,251, రామన్నపేట 18 షాపులకు 993, ఆలేరు 22 షాపులకు 1,074, మోత్కూరు 15 దుకాణాలకు 651 దరఖాస్తులు వచ్చాయి.

మూడు దఫాల నుంచి వచ్చిన దరఖాస్తులు, ఆదాయం

- 2019 - 21 సంవత్సరంలో 69 మద్యం దుకాణాలకు 1,629 టెండర్లు దాఖలయ్యాయి. వీటి ద్వారా రూ.16.29 కోట్లు, నాన్ రిఫండబుల్ ఫీజు రూపేణా మరో రూ.16.29 కోట్ల ఆదాయం వచ్చింది.
- 2021– 23లో 82 మద్యం షాపులకు 1,379 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల ద్వారా రూ.19.79 కోట్లు, ఫీజు ద్వారా మరో రూ.27.58 కోట్ల ఆదాయం సమకూరింది.
- ఈసారి నాన్ రిఫండ్ ఫీజు కింద రూ.2లక్షలు చెల్లించాలి. గతంలో రూ.లక్ష ఉండగా ఇప్పుడు రెండింతలు చేశారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు డబుల్ రేంజ్‌లో కిక్కు వచ్చింది. 82 మద్యం దుకాణాలకు 3,969 టెండర్లు వచ్చాయి. టెండర్ల ద్వారా రూ.79.38 కోట్లు, లైసెన్స్ ఫీజు రూ.44.90 కోట్లు సమకూరింది.

స్లాబ్‌లుగా విభజన

మద్యం దుకాణాలను మూడు స్లాబులుగా విభజించారు. రూ.60 లక్షలు 16 దుకాణాలు, రూ.55 లక్షలు 46 దుకాణాలు, రూ.50 లక్షలు 20 వైన్స్‌లు ఉన్నాయి. వీటి ద్వారా సంవత్సరం లైసెన్స్ ఫీజు రూ.44.90 కోట్లు సమకూరనుంది.

21న లక్కీ డ్రా

భువనగిరి, ఆలేరు, రామన్నపేట, మోత్కూరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలోని 82 మద్యం దుకాణాలను ఈనెల 21న కేటాయించనున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధి రాయగిరిలోని సోమరాధ కృష్ణా ఫంక్షన్ హాల్‌లో డ్రా ద్వారా వైన్స్‌లను కేటాయించనున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 15,276 టెండర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 336 షాపులకు 15,276 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈసారి మద్యం షాపుల కోసం గతంలో కంటే దాదాపుగా రెట్టింపు సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. రెండేళ్ల కిందట (2021లో) మద్యం షాపుల వేలం నిర్వహించగా 336 షాపుల కోసం 8,481 దరఖాస్తులు వచ్చాయి. ఈసారి కూడా మద్యం దుకాణాలు అదే సంఖ్యలో ఉన్నప్పటికీ 15,276 మంది టెండర్ దాఖలు చేశారు.రూ.305.52 కోట్లు దరఖాస్తుల ద్వారానే సమకూరాయి. గతంలో దరఖాస్తుల రూపేణా రూ.169.62 కోట్ల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేకూరింది. ఈసారి వచ్చిన దరఖాస్తుల్లో నల్లగొండ జిల్లాలో 155 షాపులకు 7,057 సూర్యాపేట జిల్లాలో 99 దుకాణాలకు 4,250, యాదాద్రి జిల్లాలో 82 షాపులకు 3,969 దరఖాస్తులు వచ్చాయి.



జిల్లా	అత్యధిక దరఖాస్తులు		తక్కువ దరఖాస్తులు	
నల్లగొండ	కనగల్ మండలం దర్వేశిపురం	187	దేవరకొండ షాపు(1)	20
సూర్యాపేట	ఆత్మకూర్.ఎస్ మండలం నెమ్మికల్	81	తుంగతుర్తి	25
యాదాద్రి	చౌటుప్పల్ మండలం ఎల్లంబావి	135	తుర్కపల్లి మండలం రుస్తాపూర్	27

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

రాజాపేట: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన రాజాపేట మండలంలోని కుర్రారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కుర్రారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బూరుగు దశరథగౌడ్ శుక్రవారం ఉదయం కల్లు గీసేందుకు గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. పక్కనే ఉన్న రైతులు గమనించి దశరథగౌడ్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



వెంకయ్య (ఫైల్)

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని జంగారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకయ్య(70) గురువారం బ్యాంకు పని నిమిత్తం ఆరూర్ గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఆరూర్ గ్రామ శివారులోకి రాగానే మోటారు సైకిల్‌పై వచ్చిన వ్యక్తి వెంకయ్యను ఢీకొట్టడంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు అంజయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

● చెరగని మధుర జ్ఞాపకం

ఒక్క ఫొటో మనం చెప్పలేని ఎన్నో భావాలను చెబుతుంది. ఒక్క ఫొటో చూడగానే మధురస్మృతులు మనసులో మెదలుతాయి. కాలంతో పాటు చోటుచేసుకునే మార్పులను ఫొటోల్లో బంధించి పదిలంగా దాచుకొని చూసుకోవచ్చు. అదే ఫొటోగ్రఫీ గొప్పతనం. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కొన్ని మరపురాని చిత్రాలు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, భజరంగ్‌ప్రసాద్, శివకుమార్, యాకయ్య


ఈ అడవికే అందం నేను..


అమ్మ ఒడిలో హాయిగా..


పంతం నీదా.. నాదా.. సై


చూడండి నా ఆ'వేషం'


కందిరీగ ఆకలి పోరాటం


సాయంకాలం.. ప్రశాంత సమయం


జో.. లాలీ..


గాల్లో తేలినట్టుందే..

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం గొప్ప నిర్ణయం

● విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చాలా గొప్పదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట డిపోలో ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల కోసం నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులను ఉద్యోగస్తులుగా మార్చిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. గతంలో ఆర్టీసీ, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలను అడ్డుకున్నది కేసీఆరే అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని, ఎల్‌ఐసీని ఇప్పటికే ప్రైవేట్ పరం చేయగా విద్యుత్ రంగాన్ని, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడానికి చేసిన, చేస్తున్న ప్రయత్నాలకు బీఆర్‌ఎస్ పూర్తి వ్యతిరేకమని అన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నేత కేసీఆర్‌తోనే ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షలు నెరవేరతాయని పేర్కొన్నారు. అవసరమైన సందర్భంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా కలిసి నడుద్దామన్నారు. బస్టాండ్ ఆవరణలో ఉన్న అంతర్గత రహదారిని త్వరలోనే నిర్మిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఎం సురేందర్, సుంకరి శ్రీనివాస్, ఎన్‌సీ సైదులు, వెంకటయ్య, లచ్చయ్య, సైదులు, కోటయ్య, పిచ్చయ్య, అంజయ్య, గౌస్, నర్సయ్య, సుధాకర్, నేతి సావిత్రి, రేణుక, లక్ష్మీ, వాణి, ఇందిర, యల్లమ్మ, సత్యవతి పాల్గొన్నారు.


సూర్యాపేట డిపో ఆవరణలో విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

సాక్షి ఫొటోగ్రాఫర్లకు రాష్ట్రస్థాయి బహుమతులు


రాష్ట్రస్థాయి మొదటి బహుమతికి ఎంపికైన ఫొటో


యాకయ్య, సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట


బెస్ట్ న్యూస్ పిక్చర్ విభాగంలో రాష్ట్ర స్థాయి బహుమతికి ఎంపికైన ఫొటో


కొల్లోజు శివకుమార్, సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి

సూర్యాపేట, భువనగిరి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో 2023 సంవత్సరానికి గాను నిర్వహించిన ఫొటోగ్రఫీ పోటీల్లో సాక్షి సూర్యాపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్య రాష్ట్రస్థాయి మొదటి బహుమతి పొందారు. అదేవిధంగా బెస్ట్ న్యూస్ పిక్చర్ కేటగిరీలో సాక్షి యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కొల్లోజు శివకుమార్ తీసిన చిత్రం రాష్ట్రస్థాయి బహుమతికి ఎంపికైంది. ఈ నెల 20న సాయంత్రం 4గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహించనున్న బహుమతుల ప్రదానోత్సవంలో యాకయ్య, శివకుమార్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు చేతులు మీదు బహుమతులు అందుకోనున్నారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో బెస్ట్ న్యూస్ పిక్చర్ కేటగిరీలో శివకుమార్ తీసిన చిత్రం ఎంపికైంది. ఈ అవార్డును శనివారం విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో ఆయన అందుకోనున్నారు.

తాను చనిపోతూ ముగ్గురికి ప్రాణదానం

● బ్రెయిన్ స్ట్రోక్‌తో యువకుడు మృతి
● అతడి అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు


రాజశేఖర్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయిన యువకుడు అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి మరో ముగ్గురికి ప్రాణదానం చేశారు. వివరాలు.. పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన కాలిన రాజశేఖర్ (30) చేనేత పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ నెల 15న రాత్రి అతడికి నిద్రలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. మూడు రోజులుగా కోమాలో ఉన్న రాజశేఖర్ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. రాజశేఖర్ కళ్లు, లివర్, కిడ్నీలను కుటుంబ సభ్యులు జీవన్‌దాన్ అనే సంస్థకు దానం చేసి మరో ముగ్గురికి ప్రాణదానం చేశారు. అనంతరం రాజశేఖర్ మృతదేహాన్ని సాయంత్రం గ్రామానికి తరలించి దహన సంస్కారాలు చేశారు. చిన్న వయస్సులోనే రాజశేఖర్ మృతిచెందటంతో ఆ కుటుంబంలో పెను విషాదం అలుముకొంది.

రైలు దిగుతూ పట్టాలపై పడిన వ్యక్తి

● అతడి కాళ్ల పైనుంచి వెళ్లిన రైలు

బీబీనగర్: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో శుక్రవారం నెమ్మదిగా వెళ్తున్న ఓ రైలు నుంచి కిందకు దిగబోయిన వ్యక్తి ప్రమాదవశాత్తు పట్టాలపై పడిపోగా.. అతడి కాళ్ల పైనుంచి రైలు వెళ్లడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్‌కు చెందిన జాపత్(35) పని నిమిత్తం విశాఖపట్నం వెళ్లి తిరిగి శుక్రవారం ఉదయం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో బీబీనగర్‌కు చేరుకున్నాడు. కాగా ఇక్కడ గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలుకు స్టాప్ లేకపోవడంతో స్టేషన్‌లో సిగ్నల్స్ కారణంగా నెమ్మదిగా రైలు వెళ్తుండడంతో జాపత్ కిందకు దిగబోయాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి రైలు కింద పట్టాలపై పడిపోయాడు. దీంతో అతడి కాళ్ల పైనుంచి అదే రైలు వెళ్లడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని క్షతగ్రాతుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

రాజాపేట: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన రాజాపేట మండలంలోని చల్లూరులో చోటుచేసుకుంది. శుక్రవారం ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సట్ల మాధవి(28), శేఖర్ భార్యాభర్తలు. శేఖర్ బట్టలు ఇస్త్రీ చేస్తూ, మాధవి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో మాధవి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మాధవి మృతిచెందిన విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం చల్లూరు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. సీఐ సురేందర్‌రెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఆలేరురూరల్: మండలంలోని కొలనుపాక గ్రామంలో శుక్రవారం అప్పుల బాధతో పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొలనుపాక గ్రామానికి చెందిన గంగరబోయిన బాలరాజు(44) శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటి తర్వాత తన భార్య సక్కుబాయికి ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే అతడి భార్య, కుమారుడు బాషా బైక్‌పై వ్యవసాయ బావి వద్దకు చేరుకొని బాలరాజును ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ఆస్పత్రి ఆవరణలోకి చేరుకోగానే అతడు మృతిచెందాడు. అప్పుల బాధతోనే బాలరాజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు.

మిర్యాలగూడలో దొంగల హల్‌చల్


● తాళం పగులగొట్టి 12 తులాల బంగారం చోరీ

మిర్యాలగూడ అర్బన్: గత కొద్దిరోజులుగా మిర్యాలగూడ పట్టణ ప్రజలకు దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లనే కాకుండా ఇంట్లో మనుషులు ఉండగానే చోరీలకు పాల్పడుతూ భయాందోళనకు గురిచేస్తున్నారు. పట్టణంలోని శరణ్య గ్రీన్‌హోంలో గత ఎనిమిది నెలలుగా చెరుపల్లి శ్రీనివాస్ ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. రైల్వే డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లగా ఆయన భార్య తల్లిగారింటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం డ్యూటీ నుంచి వచ్చిన శ్రీనివాస్ ఇంటి తాళం పగులగొట్టి ఉండటం గమనించి చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. 12 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, ముగ్గురు దొంగలు ముఖాలకు ముసుగులు ధరించి ఇంట్లోకి ప్రవేశిస్తున్న వస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిర్యాలగూడ టూటౌన్ ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

రాజాపేటలో మూడిళ్లలో చోరీ..

రాజాపేట: మండలంలోని బొందుగుల గ్రామంలో ఒకే రోజు మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బొందుగుల గ్రామానికి చెందిన గొల్లూరి ఉప్పలయ్య, ఇప్ప సురేష్, బీ. అయిలయ్య తమ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు ఆయా ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉప్పలయ్య ఇంట్లో 50 తులాల వెండి, సురేష్ ఇంట్లో 7 తులాల వెండి, అయిలయ్య ఇంట్లో 15 తులాల వెండి అపహరించారు. శుక్రవారం బాధితుల ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. చోరీ జరిగిన ఇళ్లను యాదగిరిగుట్ట ఏసీపీ శివకుమార్‌రెడ్డి పరిశీలించారు.

బొగ్గు తరలిస్తున్న రైలులో మంటలు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మిర్యాలగూడ: బొగ్గు తరలిస్తున్న రైలులో మంటలు అంటుకున్న ఘటన శుక్రవారం బీబీనగర్– గుంటూరు రైల్వే మార్గంలో విష్ణుపురం రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. విష్ణుపురం రైల్వే స్టేషన్‌లో బొగ్గుతో నిండిన గూడ్స్ రైలును నిలిపి ఉంచారు. ఇంజన్‌ను మార్చే క్రమంలో వ్యాగిన్ నుంచి మంటలు వస్తుండగా రైల్వే సిబ్బంది గమనించి మిర్యాలగూడ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ యాదగిరి, సిబ్బంది శ్రీనివాస్‌రావు, మహేందర్, శంకర్, సురేష్ ఫైరింజన్‌తో అక్కడికి చేరుకొని వెంటనే మంటలను అదుపు చేశారు.

కారును ఢీకొట్టిన తుఫాన్ వాహనం

● ఇద్దరికి గాయాలు

హాలియా: కారును తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన హాలియా పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ భర్త వెంపటి శంకరయ్య తన డ్రైవర్ వెంకట్‌తో కలిసి శుక్రవారం సాయంత్రం కారులో నల్లగొండకు బయల్దేరారు. హాలియా పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోయించుకొని రోడ్డు మీదకు రాగానే హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం వీరి కారు ముందు భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శంకరయ్య దవడకు గాయాలై నాలుగు దంతాలు ఊడిపోయాయి. డ్రైవర్ వెంకట్‌కు కడుపులో బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం డ్రైవర్‌ను నల్లగొండకు తరలించగా, శంకరయ్యకు హాలియాలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మిర్యాలగూడకు తరలించారు. శంకరయ్యను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వల్ర వెంకట్‌రెడ్డి పరామర్శించారు.

రైలు పట్టాలపై వృద్ధుడి మృతదేహం లభ్యం

ఆలేరురూరల్: ఆలేరు సమీపంలో శుక్రవారం రైలు పట్టాలపై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు భువనగిరి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎస్. సత్యనారాయణ తెలిపారు. రైలు పట్టాల పక్క నుంచి నడుస్తున్న క్రమంలో గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడు మృతిచెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతుడి వయస్సు 60 ఏళ్లు ఉంటాయని, గోధుమ రంగు పూలచొక్కా, ఆకుపచ్చ బనియన్, బ్రౌన్ రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని వివరాలు తెలిస్తే భువనగిరి రైల్వే పోలీసులకు తెలపాలని సూచించారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

సమస్యలపై సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ


సూర్యాపేటలో లేఖ విడుదల చేస్తున్న టీజేఎస్ నాయకులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేటలో ఈ నెల 20న సీఎం కేసీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో స్థానికంగా నిర్మాణాత్మక అభివృద్ధి జరగాలని, ఇంకా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని పేర్కొంటూ తెలంగాణ జనసమితి(టీజేఎస్) నాయకులు శుక్రవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంట్ల ధర్మార్జున్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కుర్చీ వేసుకొని పరిష్కరిస్తానని చెప్పిన మంచినీటి సమస్య ఇంకా తీరలేదన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో అవినీతి తప్ప నిర్మాణాత్మక అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. అశాస్త్రీయ రోడ్ల విస్తరణతో ప్రజలు, వ్యాపారులు అష్టకష్టాలు పడుతున్నారని ఆరోపించారు. మూసీ, సాగర్, ఎస్సారెస్పీ కాలువల చివరి భూములకు సాగునీరు అందేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గట్ల రమాశంకర్, జిల్లా అధ్యక్షుడు మాంద్ర మల్లయ్యయాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారబోయిన కిరణ్ కుమార్, నాయకులు బొడ్డు శంకర్‌గౌడ్, జాటోత్ శీను నాయక్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బంధన్, విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్‌గౌడ్, దేవత హరీష్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలను 'ఎస్టీ' నుంచి తొలగిస్తే గద్దె దింపుతాం

● మాజీ ఎంపీ రవీందర్‌నాయక్


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీందర్‌నాయక్, నాయకులు

నాగార్జునసాగర్: లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ కేటగిరీ నుంచి తొలగిస్తే ప్రభుత్వాలను గద్దె దింపుతామని మాజీ ఎంపీ రవీందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుటుంబ పాలనతో అవినీతికి తెగబడిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపి తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజనులుగా 33 తెగలుండగా తెలంగాణలో 13 తెగలు ఉన్నాయని తెలిపారు. గోండులు, కోయలు కేవలం 12నియోజకవర్గాలలో ఉండగా లంబాడీలు 82 నియోజకవర్గాలలో ఉన్నారని అన్నారు. 79 స్థానాలలో గెలుపోటములను శాసించే సంఖ్యలో లంబాడీలు ఉన్నారన్నారు. సారవంతమైన అటవీ భూములను గిరిజనేతరులు కాజేశారని ఆరోపించారు. లంబాడీల ఓట్లతో పదవులు అనుభవిస్తున్నావారు వారి హక్కులను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గురుకులాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని పట్టా కల్పిన వారికి కేవలం 500గజాలు ఇచ్చి మిగతా భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ బినామీలకు తక్కువ ధరకే కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఆయన వెంట నాగార్జునసాగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ రవినాయక్, తిరుమలగిరి(సాగర్) మండల పార్టీ ప్రధాన కార్యదర్శి భరత్, రవినాయక్ ఉన్నారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

● 3వేల మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీ ఏర్పాట్లు

సూర్యాపేట క్రైం: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 20న సీఎం కేసీఆర్ పర్యటించి నూతన కలెక్టర్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కాలేజీ, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాలను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సెక్టార్ల వారీగా ఇన్‌చార్జి అధికారులను నియమించారు. పోలీసు లైజన్ ఆఫీసర్‌గా అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణలో ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

ఎక్కడికక్కడ పోలీసులు..

కేసీఆర్ పర్యటన సందర్భంగా ఏడుగురు అడిషనల్ ఎస్పీలు, 24 మంది డీఎస్పీలు, 95 మంది సీఐలు, 300 మంది సబ్ ఇన్‌స్పెక్టర్‌లు, 400 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 1300 మంది కానిస్టేబుళ్లు, 130 మంది మహిళా పోలీసు సిబ్బంది, 350 మంది హోంగార్డులు, 6 రోప్ పార్టీలు, 8 బాంబ్ స్క్వాడ్ టీమ్స్, 5 డాగ్ స్క్వాడ్ టీమ్స్, 19 స్పెషల్ పార్టీ టీమ్స్ బందోబస్తులో విధులు నిర్వహించనున్నారు.

రూట్ మ్యాప్ ఇలా..

ముందుగా ఎస్వీ డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు సీఎం కేసీఆర్ చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక కారులో జనగామ రోడ్డు నుంచి ఎన్టీఆర్ పార్కు మీదుగా వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభించి అక్కడి నుంచి పక్కనే ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయం ప్రారంభిస్తారు. అనంతరం ఎస్వీ డిగ్రీ కళాశాల ముందు నుంచి వెళ్లి పక్కనే ఉన్న మెడికల్ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం సర్వీస్ రోడ్డు, జనగాం ఎక్స్ రోడ్ నుంచి నూతన బస్టాండ్ సర్వీస్ రోడ్డు, 60 ఫీట్ల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నూతన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. జిల్లా అధికారులతో మీటింగ్, మధ్యాహ్న భోజనం తర్వాత ఖమ్మం ఎక్స్ రోడ్ అండర్ పాస్ నుంచి పీఎస్‌ఆర్ సెంటర్, జమ్మిగడ్డ జంక్షన్, కొత్త మార్కెట్ రోడ్ మీదుగా బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటారు. సభ అనంతరం పీఎస్‌ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్ మీదుగా వెళ్లి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం మినీ ట్యాంక్ బండ్ నుంచి ఎస్వీ కళాశాల హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హైదరాబాద్ వెళ్లిపోతారు. ఈ మార్గం మొత్తంలో అన్ని జంక్షన్‌ల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపు ఉంటుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు.

ప్రజలు, వాహనదారులు సహకరించాలి

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో 3వేల మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున ప్రజలు, వాహనదారులు సహకరించాలి.

– రాజేంద్రప్రసాద్, ఎస్పీ